క్లుప్తంగా

శానిటరీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: శానిటరీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. బుధవారం కమిషనర్ శానిటరీ మేస్త్రీలు, సిబ్బందితో పార్కు రోడ్డులో సమావేశం నిర్వహించారు. క్లీన్ నరసాపురం సాధనలో శానిటరీ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా మూడు బుట్టల్లో సేకరించాలని చెప్పారు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెంచాలని వివరించారు. విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని కోరారు.

వారాహి దేవి గ్రామోత్సవం



వారాహిదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: శక్తి రూపాల్లో ఒకటి అయిన వారాహి దేవిని లక్ష్మీదేవి స్వరూపంగా కూడా భక్తులు కొలుస్తారని అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్య రవి అన్నారు. స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో గత 13 రోజులుగా ఉదయం, రాత్రి పూట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ హోమం నిర్వహించారు. ఆఖరి రోజు మంగళవారం పూర్ణాహుతి జరిగింది.ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి గ్రామోత్సవంను తిలకించారు.

కారు ఢీకొని గోవు మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలోని కారు ప్రమాదంలో గోవు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి యడ్లబజారు సెంటర్లో శంభుని పార్కు ప్రాంతం వద్ద దొడ్డిపట్ల రోడ్డు నుంచి పాలకొల్లుకు వస్తున్న ఓ కారు రోడ్డుపై ఉన్న గోవును ఢీకొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవును ఢీకొట్టిన కారు ఒక సైడుకు లేచిపోయి సుమారు 50 మీటర్లు దూరంగా పాకుతూ వెళ్లి ఆగిందని తెలిపారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు సైడ్ డోరులో నుంచి బయటకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉండి: అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన శాంతికి పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన పాలపర్తి నాగయ్యతో 2018 ఫిబ్రవరి 12వ తేదీన వివాహమైంది. వివాహ సమయంలో 1.60 లక్షలు, పావుకాసు బంగారం కట్నంగా అందజేసారు. వివాహానంతరం చెడు వ్యసనాలకు అలవాటుపడిన నాగయ్య అదనపు కట్నం రూ.2 లక్షలు తేవాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. అయితే ఇటీవల వేధింపులు మరీ ఎక్కువ కావడంతో పాటు కొట్టడంతో ఆమె పుట్టినింటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్తపై ఫిర్యాదు

భీమవరం: విడాకులు ఇవ్వకుండా తన భర్త వేరొకరిని వివాహం చేసుకున్నాడంటూ భీమవరం పట్టణానికి చెందిన కె. దివ్యభవాని ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. 2017లో హైదరాబాద్లో ఆర్యసమాజంలో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం నుంచి ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

ఉండి: ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నాయీం ఆదేశాల మేరకు ఉండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని హైస్కూల్స్ పరిసరాల్లో దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఉండి పీఎస్ పరిధిలోని అన్ని జెడ్పీ హైస్కూల్స్ సమీపంలోని పలు దుకాణాలలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు.

పశువుల బీమాకు ఆదరణ కరువు

బీమా చేయించుకోవడానికి ముందుకు రాని పాడి రైతులు



అబ్బిరాజుపాలెంలో పశువుల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశు వైద్యాధికారి

యలమంచిలి: పశుపోషణ వ్యవసాయ అనుబంధ రంగం. పల్లెల్లో ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు చాలానే ఉన్నాయి. పాడి పశువులు ప్రమాదవశాత్తూ గానీ, జబ్బు చేసి గానీ, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను, విష సర్పాల కాటు వల్ల అగ్ని ప్రమాదాల వలన మరణిస్తే ఆ పాడిరైతుకు చాలా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే పశువులకు బీమా చేయించడానికి రైతులు ముందుకు రావడం లేదు.

20 శాతం రైతులు చెల్లించాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశువులకు బీమాను అందజేస్తున్నాయి. ఈ బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2 వేలు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.800 రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చెల్లిస్తాయి. మిగిలిన రూ.400 రైతులు చెల్లించాలి. అదే గొర్రెలు లేదా మేకకు అయితే కేవలం రూ.20 కడితే మిగిలిన రూ.80 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి లేదా రెండు పశువులు ఉన్న రైతులు బీమా ప్రీమియం కడుతున్నారు కాని, 10కి పైగా పాడి పశువులు ఉన్న రైతులు ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించలేక బీమా కట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశువుల బీమాకు ఆదరణ కరువైంది. పాలకొల్లు నియోజకవర్గంలో సుమారు 6714 పాడి పశువులు (ఆవులు, గేదెలు) 4721 గొర్రెలు, మేకలు, పందులు ఉన్నాయి. వీటిలో కేవలం 953 పశువులకు మాత్రమే రైతులు బీమా ప్రీమియం చెల్లించారు. ఒక్క గొర్రెకు, మేక, పందులకు కూడా ఎవరూ భీమా కట్టలేదని పశు సంవర్ధక శాఖ అధికారులు చెప్పారు.

బీమా అమలయ్యేదిలా..

ఏదైనా ప్రమాదం వలన జంతువు మరణిస్తే దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి చెందిన పశువులకు రూ. 15 వేలు, గొర్రె, మేక, పందికి రూ. 6 వేలు వరకు భీమా వస్తుంది. అయితే చాలా మంది రైతులు భీమా చెల్లించకపోవడంతో ప్రమాదవశాత్తూ పశువు మరణించినా ఒక్క రూపాయి కూడా రావడం లేదు. ఆ సమయంలో రైతులు నాయకులతో సిఫారసు చేయించినా, అధికారులు చుట్టూ తిరిగిన ప్రయోజనం ఉండదు. కాబట్టి ప్రతి పశువుకు బీమా చేయించాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా లంక గ్రామాల రైతులకు భీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏడాది వరదలు వస్తున్న తరుణంలో విష సర్పాల వలన, వరదల వల్ల పశువులకు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల రైతులంతా తప్పనిసరిగా ప్రతి పశువుకు బీమా చేయించడం ఉత్తమమని వివరిస్తున్నారు.

“ రైతులు స్పందించడం లేదు



పాడి రైతులు కేవలం 20 శాతం భీమా కడితే మిగిలిన 80 శాతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీమా చెల్లిస్తాయి. బీమా కట్టమని రైతులను ఎంతగా ప్రాధేయపడినా స్పందించడం లేదు. ఒక వేళ పశువు మరణిస్తే అప్పుడు సిఫారసులు చేయిస్తున్నారు. బీమా లేకపోతే ఎవ్వరూ ఏమీ చేయలేం. కాబట్టి రైతులంతా తప్పకుండా తమ పశువులకు బీమా చేయించుకోవడం మంచిది.

– డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల పశు వైద్యాధికారి, యలమంచిలి

మార్గదర్శకాలివే..

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు అందించాలి. పాడి పశువులకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. ప్రమాదవశాత్తూ పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ బీమా చేయించిన పశువును అమ్మివేస్తే పశువును కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి తన పేరు మీద బీమా మార్చుకోవాలి.

విద్యార్థినికి సైకిల్ అందజేత



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఓ విద్యార్థినికి సైకిల్ అందజేశారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బివిఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినికి రూ. 7 వేలు విలువ చేసే సైకిల్‌ను క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, జవ్వాజి కళ్యాణ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్రావు పాల్గొన్నారు.

అరుణాచలం రైలుకు స్వాగతం



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం టు అరుణాచలం రైలును నూతనంగా ఏర్పాటు చేశారు. బుధవారం నరసాపురంలో ఈ రైలును ప్రారంభించిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అదే రైలులో ప్రయాణం చేశారు. మధ్యాహ్నం 1.10 గంటలకు పాలకొల్లు చేరుకున్న ఈ రైలులో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

అరుణాచలం నుంచి వచ్చే వారి సంగతేంటి?

అరుణాచలం వెళ్లే ప్రయాణికులకు ప్రతి బుధవారం నరసాపురం నుండి రైలు నెం 07219 మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి గురువారం ఉదయం 5 గంటలకు అరుణాచలం వెళుతుంది. అలాగే అరుణాచలంలో గురువారం ఉదయం 11 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 3 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. అయితే నూతన రైలు ఏర్పాటు చేసినా తిరుగు ప్రయాణికుల గురించి పట్టించుకోవడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. దర్శనం అనంతరం శుక్రవారం అరుణాచలం నుంచి రైలు ఏర్పాటు చేస్తే వచ్చే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని అంటున్నారు. కాబట్టి ఈ రైలు సమయం మార్చాలని కోరుతున్నారు.

ఉపాధి హామీపై అవగాహన ర్యాలీ

ఉండి: ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చినపుల్లేరు గ్రామ సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మరామరాజు సూచించారు. బుధవారం గ్రామంలో ఉపాధిహామీ పథకంపై సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ రీసోర్స్‌పర్సన్ అత్యుతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ కూలీకి వందరోజుల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయించాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం పనులు కల్పింస్తుందని అన్నారు. గ్రామ గ్రామాన ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఆర్పీ దుర్గాభవానీ మాట్లాడుతూ గత ఏడాది 45 రకాల పనులు గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని నిర్వహించామని ఇప్పుడు కూడా పనులు గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొర్రా సువర్ణరాజు పాల్గొన్నారు.

పెనుమంట్రలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



పెనుమంట్ర ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



తల్లిదండ్రులకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి

పెనుమంట్ర: స్థానిక దళితవాడలోని ఎల్ఈ పాఠశాల విద్యా కమిటీ సభ్యులను మండల విద్యాశాఖ అధికారితో పాటు, స్థానిక ప్రధానోపాధ్యాయులు పక్కదారి పట్టించి ఈ పాఠశాల మూడు నాలుగు ఐదు తరగతులను దళితవాడకు దూరంలో ఉన్న వేరొక పాఠశాలలో విలీనం చేయడం తగదని బుధవారం ఆందోళన చేశారు. స్కూల్ ప్రారంభం నుంచి ఆందోళన చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకుండా మధ్యాహ్నం భోజనం పెట్టకుండా వారి కడుపులు మార్చుతున్నారని ఆరోపించారు. పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణితో పాటు ఆచంట నియోజకవర్గానికి చెందిన దళిత సంఘాల నాయకులు సుంకర సీతారాం, ఉన్నమట్ల మునిబాబు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన చేస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులకు మద్దతు తెలిపారు. వారితో కలిసి తహసీల్దార్ వై.రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెనుమంట్ర, జుత్తిగ, కోడూరు గ్రామ సర్పంచ్లు తాడిపర్తి ప్రియాంక, తమనంపూడి వీర్రెడ్డి, బుర్ర రవికుమార్, ఉప సర్పంచ్‌లు భూపతిరాజు శ్రీనివాసరాజు, కర్రి వేణుబాబు, కొవ్వూరు చిన్నారెడ్డి, ఆచంట మండల జేఏసీ చైర్మన్ కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు సుఖిమాల సమర్పణ



వాసవీ మాతకు సుఖమాల సమర్పిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో పూజలందుకుంటున్న మరకత శిల వాసవీ మాతకు ఈసీ మెంబర్ ఉమా రాజులు సుఖమాలను సమర్పించారు. బుధవారం వాసవీ శాంతి ధాంలో జరిగిన కార్యక్రమంలో సుఖమాలను, అధికార దండాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులుకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎస్ గోవిందరాజులు మాట్లాడుతూ 102 గోత్రాలకు సూచికగా వాసవీ మాత వాహనమైన చిలుకను మాలపై 102 చిలుకలుగా తీర్చిదిద్ది సుఖమాలను తీర్చిదిద్దినట్లు వివరించారు. బెంగుళూరులోని వాసవీ ఆలయానికి, జన్మస్థలమైన పెనుగొండలోని వాసవీ మాతకు మాలను సమర్పించినట్లు వివరించారు.

నేడు ఆషాఢ పౌర్ణమి వేడుకలు

ఆషాడ మాసం సందర్భంగా వాసవీ శాంతి ధాంలో గురువారం క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాలా స్వామి) పర్యవేక్షణలో ఆషాఢ పౌర్ణమి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ అర్చకత్వంలో గోపూజలు, ధ్వజారోహణ, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహిస్తామన్నారు.

దాతల సహకారం అవసరం

తాడేపల్లిగూడెం: తమ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు వసతులు , సౌకర్యాలు కలిపించడంలో ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారం కూడా అవసరమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ వి.ప్రసన్నశ్రీ అన్నారు. బుధవారం గూడెం వచ్చిన ఆమె కొంత సేపు విలేకర్లతో మాట్లాడారు. ఇటీవలి కాలంలోనే వీసీగా బాధ్యతలు తీసుకున్న తాను వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నానన్నారు. దాతృత్వానికి పెట్టింది పేరు ఉభయగోదావరి జిల్లాలని ఇక్కడి దాతల సహకారంతో అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

పీ-4 కార్యక్రమంపై శిక్షణ



సిబ్బందికి సూచనలిస్తున్న నోడల్ అధికారి విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పి–4 కార్యక్రమం చేపట్టిందని మునిసిపల్ నోడల్ ఆఫీసర్ బందెల విజయసారధి అన్నారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాలులో సిబ్బందికి అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. నిరుపేద కుటుంబాలను సామాజికంగా, ఆర్థికంగా ఆదుకునేందుకు దాతల గుర్తింపు ప్రక్రియను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని సూచించారు.

ఆచంటలో..

పెనుగొండ: పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు, స్నేహగ్రామాలుగా రూపొందించాలని ఆచంట ఎంపీడీఓ బీకృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఆచంట గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు,ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు 2025–26 సంవత్సరానికి గాను పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక తయారు చేసేందుకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, 9 థీమ్స్, పేదరికంలేని గ్రామం, తాగునీరు, ఆరోగ్యం, ఉపాధి, స్త్రీల, బాల, స్నేహ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పురోగతి సూచికను అమలుపై శిక్షణనిచ్చారు. అదేవిధంగా పీ 4 ఏవిధంగా మార్గదర్శి ఉంటుందో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు హనుమంతరావు, దుర్గా ప్రసాద్, జ్యోతి కార్యదర్శులు, నాగబాబు, జానకి లు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయత్ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్ పోర్టల్‌పై శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణమూర్తి, ఎంఈఓ డి.శుభాకరరావు కోరారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వై.దుర్గా కిషోర్

పాలకొల్లు సెంట్రల్: జిల్లా కలెక్టర్ జారీ చేసిన అక్రిడేషన్లు లేకుండా కొందరు విలేకరులమని చెప్పుకుని అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం, వేధిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఇకపై ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ హెచ్చరించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గా కిషోర్ మాట్లాడుతూ నాలుగు రోజులు క్రితం ఇద్దరు వ్యక్తులు వచ్చి రూరల్ పంచాయతీ పరిధిలో ఉన్న ఓ లేఅవుట్‌పై మహిళా వీఆర్‌ఓను వివరాలు అడిగారు. ఆమె గ్రామ సెక్రటరీ లేదా తహసీల్దార్‌లను అడగాలని తెలిపారు. అయితే వారు తహసీల్దార్ కార్యాలయానికి వాగ్వివాదానికి దిగారని, అంతేకాక వాస్తవ దూర కథనాన్ని ప్రచురించారని మండిపడ్డారు. విలేకరులు అడిగితే వివరాలు ఇస్తామని, కానీ విధులకు ఆటంకం కలిగించే రీతిలో వారి వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మిక సంఘాల సమ్మె విజయవంతం



పెనుగొండ: ఆచంటలో మానవహారం నిర్వహిస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు

నరసాపురం: నూతన లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ కార్మికసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మె నరసాపురంలో విజయవంతంగా సాగింది. ఆక్వా కార్మికులు, బజారు జట్టు కార్మికులు, ఐకేపీ, ఆశ వర్కర్లు, సివిల్ సప్లై మున్సిపల్ రంగాల కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, అంగన్‌వాడీ నాయకులు శ్రీలక్ష్మి, వెంకటదుర్గ, ఆశ వర్కర్ల నాయకులు ఆదిలక్ష్మి,పెద్దిలక్ష్మి, సీఐటీయూ నాయకులు బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, పొన్నాడ మల్లేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన జాతీయస్థాయి సమ్మెలో పట్టణ ఎల్ఐసి కార్యాలయ ఉద్యోగులు పూర్తి స్థాయిలో పాల్గొన్నారు. బుధవారం సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ సంఘ అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ కార్మికుల హక్కులు హరించివేసే నాలుగు కొత్త లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సురేంద్రన్, వై.నరసింహరావు, నాళం బాపిరాజు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, గాంధీబొమ్మల సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రాయ్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జవ్వాది శ్రీనివాస్, ఏకేవీ రామభద్రం, నూలి లక్ష్మీనారాయణ, పస్తుల లక్ష్మణ్, నక్కా రాజేష్, తిరుమాని రమేష్ పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో కార్మిక వర్గంతో పాటు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్‌అన్నారు. ఆచంటలో బుధవారం లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఆచంటలో కార్మిక సంఘాలు నినాదం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి, కచేరీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైట్ల ఉషారాణి, బండి రంగారావు, ఎస్‌వీఎస్ శర్మ, దాసిరెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండలో

ప్రమాదకర నాలుగు లేబరు కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పెనుగొండలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాగిశెట్టి గంగారావు, పీడీ పరమేశ్వరి, కంకిపాటి లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన ఉద్యోగులు, కార్మికులు బ్రాహ్మణ చెరువులోని సివిల్ సప్లై గోడౌన్స్ నుంచి ర్యాలీగా బయలుదేరి మానవహారం నిర్వహించారు. అనంతరం పెనుమంట్ర హైస్కూల్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఆకుల హరే రామ్, కె.సుబ్బరాజు, కోడి శ్రీనివాస ప్రసాద్, ఎస్ చిత్రంజ్ తదితరులు పాల్గొన్నారు.



పెనుమంట్ర: బ్రాహ్మణచెరువులో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్

90102 23729 (పాలకొల్లు)

81869 95956 (నరసాపురం)

90102 23729 (ఆచంట)

Office mail : tpgadvt@gmail.com